క్లుప్తంగా

ఘనంగా ముత్యాలమ్మ తీర్థం



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి: గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లి తీర్థాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి చిరుతాడిని గరగ నృత్యాలతో కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామాల్లో ఘనంగా ఊరేగించారు. భక్తులకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. కొత్తపల్లి గ్రామం నుంచే కాకుండా, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, ఉప్పాడతో పాటు, పలు గ్రామాల నుంచి భక్తులు అమ్మవారికి చలివిడి, వడపప్పును నైవేద్యంగా సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మరిడమ్మ ఆలయంలో చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

పెద్దాపురం: బుద్ధ పౌర్ణమి సందర్భంగా స్థానిక మరిడమ్మ తల్లి ఆలయంలో గురువారం చండీహోమం నిర్వహించారు. ఏటా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనారావు ఆధ్వర్యంలో వేద పండితులు ఐవీ ప్రసాద్ శర్మ, ఎన్‌వీ శాస్త్రి, ఏవీ భానుమూర్తి మంత్రోచ్చారణల మధ్య హోమాన్ని నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అపర్ణాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అపర్ణాదేవి అమ్మవారు

గొల్లప్రోలు: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకర శాస్త్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, 11 రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. సహస్రనామ కుంకుమార్చన, అష్టోత్తర శతనామ కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం ప్రసాద వితరణ చేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారికి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది భక్తులకు సేవలందించారు.

సప్లిమెంటరీ పరీక్షలకు 533 మంది విద్యార్థులు

సామర్లకోట: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను 533 మంది విద్యార్థులు రాయనున్నట్లు మండల విద్యాశాఖాధికారి వై.శివరామ కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12.45 నిమిషాల వరకు పరీక్షలు ఉంటాయని చెప్పారు. మండల పరిధిలోని సప్లిమెంటరీ విద్యార్థులకు బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్, జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ పరీక్షలు జూన్ మూడో తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని నియమించడంతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలను కల్పించినట్టు తెలిపారు. విద్యార్థులు ఆయా పరీక్షా కేంద్రాలకు 45 నిమిషాలు ముందుగా హాజరు కావాల్సి ఉంటుందని చెప్పారు.



పీసీసీ సమ్మర్ క్యాంప్‌లో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులు



మ్యాజిక్ షోను ఆసక్తిగా తిలకిస్తూ..



రాత్రి సమయంలో కర్రసాము సాధన చేస్తున్న విద్యార్థులు

వేసవి వేడి.. కొత్త పాఠాల బడి

- విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తున్న పీసీసీ
- ఏటా వేసవి శిక్షణలో 200 మందికి శిక్షణ
- సమ్మర్ క్యాంప్‌లో కోలాహలం

పెద్దాపురం: వేసవి వేడిలోనూ విద్యార్థులు కొత్త పాఠాలు నేర్చుకుంటున్నారు. పాఠశాల సమయంలో పుస్తకాలు, చదువు, పరీక్షలతో ఆటలకు దూరమయ్యే విద్యార్థులను వేసవి శిక్షణా శిబిరాలు అన్ని విధాలా ఆదుకుంటున్నాయి. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఏటా వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తోంది. నెల రోజుల పాటు నిర్వహించే వేసవి శిక్షణలో విద్యార్థులకు పలు రంగాల్లోని నిపుణులతో శిక్షణ ఇస్తారు.

ఆహ్లాద వాతావరణంలో..

గతేడాది 100 నుంచి 150 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వగా, ఈ ఏడాది 200 నుంచి 250 మంది సమ్మర్ క్యాంప్ పేరిట శిక్షణ ఇస్తోంది పీసీసీ. ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు చెట్ల నీడన వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనం వద్ద ఆహ్లాద వాతావరణంలో విద్యార్థుల కోలాహలం మధ్య శిక్షణ ఉత్సాహంగా సాగుతోంది. శిక్షణకు సంబంధించి విద్యార్థుల మాటల్లోనే..

కథలు రాయాలని ఉంది



నాకు కథలంటే చాలా ఇష్టం. కరాటే నేర్చుకోవాలని ఉండేది. నేర్చుకోలేక పోతానేమో అనుకున్నా. సమ్మర్ క్యాంప్‌లో కరాటే శిక్షణ నన్ను మరింత ఉత్సాహపరిచింది. అన్ని రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పుడు కథలు రాయాలనే ఆసక్తి మరింత పెరగడమే కాకుండా, రాయగలననే పూర్తి విశ్వాసం కలిగింది.

– గణేష్, 8వ తరగతి విద్యార్థి, పెద్దాపురం

సెల్ఫ్ డిఫెన్స్‌కు ఉపయోగం



సమ్మర్ క్యాంప్‌తో మాకు ఎంతో ఉపయోగపడుతోంది. మ్యాథ్స్ బేసిక్స్ బాగా నేర్పుతున్నారు. ఉదయం నేర్పించే కరాటే ఆసక్తిగా, సెల్ఫ్ డిఫెన్స్‌కు ఉపయోగపడేలా ఉంది. ఆరోగ్యం, మానసికోల్లాసానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుంది.

– హాసిని, 9వ తరగతి విద్యార్థిని, పెద్దాపురం

విజ్ఞానం, వినోదం, వికాసమే లక్ష్యం



వేసవి సెలవుల్లో విద్యార్థులు టీవీ, మొబైల్ ఫోన్లకు అతుక్కుపోకుండా విద్యార్థుల ఆలోచనలో మార్పు తీసుకురావాలనేదే మా ప్రయత్నం. విజ్ఞానం, వినోదం, వికాసాన్ని విద్యార్థులకు అందజేయడమే లక్ష్యంగా పీసీసీ వేసవి శిక్షణా శిబిరాన్ని రెండో ఏడాది కొనసాగిస్తోంది. ప్రశ్నించడం ద్వారా మాత్రమే కొత్త అంశాలను తెలుసుకోగలమని చెప్పడమే పీసీసీ ప్రధాన లక్ష్యం.

– కూనిరెడ్డి అరుణ, సమ్మర్ క్యాంప్ కో–ఆర్డినేటర్, పెద్దాపురం

మాండవ్య నారాయణుని గ్రామోత్సవం



మాండవ్యనారాయణస్వామి గ్రామోత్సవం

సామర్లకోట: మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం గురువారం భక్తి శ్రద్ధలతో జరిగింది. ప్రతి నెల పౌర్ణమిని పురస్కరించుకుని గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా తెల్ల వారు జామున ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులచే విష్ణు సహస్రనామ పారాయణ జరిగింది. సాయంత్రం ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, చిన్నవీధి, పెద్దవీధి, యార్లగడ్డ వారి వీధి, మఠంసెంటర్, అయోధ్యరామపురం, కొత్తూరు మీదుగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి గ్రామోత్సవం ఆలయానికి చేరింది. భక్తులు తమ తమ ఇళ్ల వద్దకు వచ్చిన స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

తాగునీటిపై ఆందోళన వద్దు

- మున్సిపల్ కమిషనర్ రామారావు
- ఫిల్టర్ బెడ్ పరిశీలన
- కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచన



ఫిల్టర్ బెడ్ చెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామారావు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటిపై ప్రజలు ఆందోళన చెందవలసి న పని లేదని మున్సిపల్ కమిషనర్ జె రామారావు అన్నారు. గత వారం రోజులుగా మున్సిపల్ కుళాయిల నుంచి ఆకుపచ్చరంగులో నీరు రావడంతో సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబు, మానవహక్కుల సంఘ జిల్లా అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండలు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఫిల్టర్ బెడ్ ప్లాంటును, పిల్టర్ బెడ్ చెరువును పరిశీలించారు.

ఫిల్టర్ బెడ్‌లో శుద్ధి అవుతున్న నీటిని ఆయన పరిశీలించారు. ఫిల్టర్ బెడ్ వద్ద సచివాలయంకు చెందిన జూనియర్ ఇంజనీరును ప్రత్యేకంగా నియమించడం జరిగిందని తెలిపారు. గోదావరి కాలువలో నీరు లేక పోవడం వలన చెరువులో నీరు నాచు రంగులో ఉన్నదన్నారు. ఈ చెరువులో నీటిని నాగార్జున ఫ్యాక్టరీ ఉపయోగించకపోవడం వలన చెరువులో నీటి మట్టం ఎక్కువగానే ఉన్నదని తెలిపారు. చెరువులో నీటిని ఫిల్టరు ప్లాంటు ద్వారా శుద్ధి చేయడం జరుగుతుందని, కొద్దిగా ఆకుపచ్చరంగులో నీరు వస్తుందని చెప్పారు. నీటిని శుద్ధి చేయడానికి ఆల్లమ్, క్లోరిన్ తగిన మోతాదులో ఉపయోగించడం జరుగుతుందన్నారు. అంతకు మించి ఉపయోగిస్తే ప్రజల ఆరోగ్యాన్ని హాని కలుగుతుందని తెలిపారు. చెరువులో నీరు ఆకుపచ్చరంగులో ఉండటంపై పబ్లిక్ హెల్త్ డీఈ, ఏఈల దృష్టికి తీసుకు వెళ్లడంతో వారు చెరువును పరిశీలించారని చెప్పారు. చెరువులో హైడ్రోజన్ పెరాక్సైడ్ వేయాలని సూచించడం జరిగిందన్నారు. ఈ మేరకును దానికి ఆర్డరు ఇవ్వడం జరిగిందని, వచ్చిన తరువాత చెరువులో కలుపుతామన్నారు. చెరువులో నీటిని శుద్ధి చేసి ఇవ్వడం జరుగుతుందని, ప్రజలు తాగునీటిని వేడి చేసి చల్లార్చి తాగడం మంచిదని సూచించారు. గోదావరి కాలువ వచ్చిన తరువాత చెరువులో నీటి మట్టం పెరిగితో నాచు సమస్య పరిష్కారం అవుతుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 10 వరకు బోర్లు ఉన్నాయని, ఆ నీటిని ఇవ్వడానికి ప్రయత్నం చేస్తే ప్రతీ ఒక్కరూ ఫిల్టర్ బెడ్ నీటినే ఇవ్వాలని కొరుతున్నారని చెప్పారు.

కౌంటింగ్ ప్రక్రియకు సహకరించాలి

- ఆర్డీఓ జేఎస్ రామారావు



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా వచ్చే నెల నాలుగో తేదీన కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో గురువారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జేఎస్ రామారావు మాట్లాడుతూ జేఎన్‌టీయూ ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడెంచల భద్రత కల్పించారన్నారు. నాలుగో తేదీన ఉదయం పెద్దాపురం మండలం జె.తిమ్మాపురం ఒకటో నెంబర్ పోలింగ్ బూత్ ఈవీఎంల నుంచి కౌంటింగ్ ప్రారంభమై సామర్లకోట మండలం పనసపాడు 201వ పోలింగ్ కేంద్రంతో ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపుతో ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. కౌటింగ్ ప్రక్రియకు సంబంధించి 14 టేబుళ్ల ద్వారా 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశించిన నిర్దేశాల ప్రకారం ప్రజలు సమన్వయం పాటించి కౌంటింగ్‌కు సహకరించాలని ఆర్డీఓ కోరారు. అనంతరం పలు అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు కేవీ పద్మావతి, రామారావు, ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్, ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అందరి చూపు.. పిఠాపురం వైపు

- పార్టీలు, అభ్యర్థులు, మెజార్టీపై బెట్టింగులు

కొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై నియోజకవర్గంలో బెట్టింగులు మితిమీరుతున్నాయి. రాష్ట్రంలోని 175 నియోజవర్గాల్లో ఎన్నికల ఫలితాలు ఒక ఎత్తయితే, పిఠాపురం నియోజకవర్గ ఫలితం మరో ఎత్తు. ఈ నియోజకవర్గ ఫలితాలపైనే బెట్టింగులు జోరందుకున్నాయి. ఎన్నికల ఫలితాలపై ప్రజల్లో ఉన్న ఆసక్తిని తెలివిగా కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. ఐపీఎల్ క్రికెట్ తరహాలోనే ఎన్నికల ఫలితాల్లో కొత్తగా ఏర్పడే ప్రభుత్వం, అభ్యర్థుల విజయం, వారి మెజార్టీ, మండలాలు, మున్సిపాలిటీల వారీగా మెజార్టీ.. ఇలా రకరకాలుగా బెట్టింగులు నిర్వహిస్తున్నారు. ఇతర నియోజకవర్గాల నుంచి వచ్చి ఇక్కడ బెట్టింగులు కాస్తుండడం విశేషం. వైఎస్సార్ సీపీ అభ్యర్థి వంగా గీత, జనసేన అభ్యర్థి పవన్ కల్యాణ్ జయాపజయాలతో పాటు, ఇండిపెండెంట్ అభ్యర్థి మెజార్టీ పైనా బెట్టింగులు సాగుతున్నట్టు సమాచారం. ఎవరికి వారే అభ్యర్థుల విజయాలపై అంచనాలు వేసుకుంటూ బెట్టింగ్‌కు దిగుతున్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు నాటికి ఈ జోరు మరింత పెరిగే అవకాశం ఉంది.

బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు



జరిగిన ఎన్నికల ఫలితాలపై, ఐపీఎల్ క్రికెట్ పోటీలపై బెట్టింగులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. బెట్టింగులు జరిగితే పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలి.

– స్వామినాయుడు, ఎస్సై, కొత్తపల్లి

భక్తిశ్రద్ధలతో శ్యామలాంబ తిరునాళ్లు



అచ్చంపేట శ్యామలాంబ అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీసిన భక్తులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో కొలువైన శ్యామలాంబ అమ్మవారి ఆలయంలో గురువారం సాయంత్రం నుంచి భక్తులు పోటెత్తారు. గ్రామ దేవతగా పేరు పొందిన శ్యామలాంబ ఆలయం లో బుధవారం రాత్రి జాతర ఉత్సవాలతో అమ్మవారి తిరునాళ్లు ప్రారంభమైన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా మండల పరిధిలోని అనేక గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయ కమిటీ నాయకులు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని చీరలు, కోళ్లు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

యోగా, ధ్యానంతో మానసికోల్లాసం



గ్రంథాలయంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పెద్దాపురం: యోగా, ధ్యానం చేయడం ద్వారా ప్రతి విద్యార్థికీ మరింత మానసికోల్లాసం సంప్రాప్తిస్తాయని సమ్మర్ క్యాంప్ నిర్వాహకులు, గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం యోగాసనాలు నేర్పించారు. ఈ సందర్భంగా సుమారు 30 మంది విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయంలో అందిస్తున్న పుస్తకాలను చదివి విద్యార్థులు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య పాల్గొన్నారు.

అనధికార పార్కింగులతో ప్రమాదాలు



ట్రాక్టర్‌ను ఢీకొన్న బస్సు, రోడ్డు మార్జిన్‌లో నిలిపి ఉంచిన లారీ

సామర్లకోట: స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద విటికర్ బాలికల పాఠశాల ప్రవారీ వద్ద కొంత కాలంగా లారీలు నిలిపి ఉంచడం వల్ల తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గురువారం స్థానిక బస్సు కాంప్లెక్స్ నుంచి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి ప్రత్తిపాడు రోడ్డులోనికి పెద్దిపాలెం బస్సు మలుపు తిప్పుతుండగా పెద్దాపురం నుంచి ట్రాక్టర్ రావడంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఎవరికీ ఏ ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి అక్కడి లారీల డ్రైవర్లను హెచ్చరించి వాహనాలను తొలగించారు. కొంత కాలంగా ఈ రోడ్డు మార్జిన్‌లో లారీలు పార్క్ చేయడం, మరమ్మతులు చేయడం వల్ల భారీ వాహనాల రాకపోకలకు తరచూ అంతరాయం కలుగుతోంది. రోడ్డు మార్జిన్‌లో పార్కింగ్ చేసిన లారీల డ్రైవర్లకు హెచ్చరికలు జారీ చేసి పార్కింగ్ చేసిన వాహనాలు తొలగించారు.

అమెరికాకు జేఎన్‌టీయూకే బృందం



డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు

బాలాజీ చెరువు (కాకినాడ సిటీ): యూనివర్సిటీ అభివృద్ధిలో విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం కోసం జేఎన్‌టీయూకే బృందం వారం రోజుల పాటు అమెరికాలో పర్యటిస్తోందని ఉప కులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జేఎన్‌టీయూకేకి న్యాక్–ఎ+ హోదా వచ్చిన నేపథ్యంలో పూర్వ విద్యార్థుల ఆహ్వానం మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్‌తో కూడిన ప్రతినిధి బృందం అమెరికాలో పర్యటిస్తోందని పేర్కొన్నారు. శాన్‌ఫ్రాన్సిస్కో, డల్లాస్, వాషింగ్టన్ డీసీలో నిర్వహించే సమావేశాల్లో ఈ బృందం పాల్గొంటుందన్నారు. అలాగే అమెరికా మిస్సోరీ యూనివర్సిటీ, చికాగో స్టేట్ యూనివర్సిటీ, టెక్సాస్ ఏఅండ్‌ఎం యూనివర్సిటీతో సహకార కార్యక్రమాలు, స్టూడెంట్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ పోగ్రాం, అంతర్జాతీయ గ్రాంట్ల మంజూరుకు దరఖాస్తు, పరిశోధనలపై చర్చలు ఉంటాయని వివరించారు. యూఎస్ వర్సిటీలతో భాగస్వామ్య ఎంఎస్ ప్రోగ్రాములు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, మిస్సోరీ వర్సిటీతో జాయింట్ గ్రాంట్‌కు దరఖాస్తు చేస్తామని తెలిపారు. పార్టనర్‌షిప్–2020 గ్రాంట్ విజయవంతంగా అమలు చేసినందుకు అమెరికా ప్రభుత్వం నుంచి ఎక్సలెన్స్ సర్టిఫికెట్ పొందామన్నారు. చికాగో స్టేట్ యూనివర్సిటీతో కలిసి 2015–19 మధ్య ఒబామా – సింగ్ ఇనిషియేటివ్ గ్రాంట్ విజయవంతంగా నిర్వహించామని డాక్టర్ ప్రసాదరాజు తెలిపారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు వేగవంతం చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నివాస్



జేఎన్‌టీయూకేలో ఓట్ల లెక్కింపునకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: జేఎన్టీయూలో భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను గురువారం రాత్రి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ, పిఠాపురం నియోజకవర్గ ఆర్ఓ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. జేఎన్టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో భద్రపరిచిన పిఠాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజవర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. అనంతరం కాకినాడ పట్టణం, తుని, నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిమిత్తం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

పెట్రోలు, డీజిల్ లూజు విక్రయాలు నిషేధం

- డిప్యూటీ కలెక్టర్ (ఫ్లయింగ్ స్క్వాడ్) ఏవీఎస్ఎస్ మూర్తి



ప్రత్తిపాడులో పెట్రోలు బంక్ యజమానికి సూచనలు ఇస్తున్న ఏవీఎస్ఎస్ మూర్తి

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బంకుల్లో పెట్రోలు, డీజిల్ లూజ్ విక్రయాలు నిషేధమని కాకినాడ జిల్లా డిప్యూటీ కలెక్టర్ (ఫ్లయింగ్ స్క్వాడ్) ఏవీఎస్ఎస్ మూర్తి స్పష్టం చేశారు. గురువారం ప్రత్తిపాడు మండలంలోని పలు గ్రామాల్లో పెట్రోలు బంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లో సుమారు 150 పెట్రోలు, డీజిల్ బంకులకు లూజు అమ్మకాలు సాగించరాదని ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయిన 15 రోజుల వరకూ పెట్రోలు, డీజిల్‌ను కేవలం వాహనదారులకు, పెట్రోల్ బంక్ వద్దకు వచ్చిన వాహనాల్లో మాత్రమే నింపాలని బంక్ యజమానులకు ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించి పెట్రోలు, డీజిల్ లూజు విక్రయాలు సాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ప్రత్తిపాడు తహసీల్దార్ ఎస్.నరసింహరావు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎస్సై పి.కృష్ణకుమార్, స్థానిక పోలీసు సిబ్బంది ఉన్నారు.

బాణసంచా తయారీ, విక్రయాలపై చర్యలు



గండేపల్లిలో మందుగుండు సామగ్రి తయారీదారుడితో సీఐ లక్ష్మణరావు

గండేపల్లి: మందుగుండు సామగ్రి తయారుచేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని జగ్గంపేట సీఐ ఎస్ లక్ష్మణరావు అన్నారు. గండేపల్లి శివారు రంగంపేట వెళ్లే మార్గంలో ఉన్న ఆర్కాఫైర్ వర్క్స్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్, సెక్షన్ 30 యాక్ట్ అమల్లో ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. అలాగే జూన్ 6 వరకు ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి ర్యాలీలకు అనుమతులు లేవని, బాణసంచా తయారీ కానీ, విక్రయించినా కానీ చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.